# అనుమానం ప్రాణసంకటం

పైన మబ్బు వేసినట్లయింది. గాలి సరీగ్గా అతుక్కున్నట్లు లేదు.
సాంబయ్యగారు బాగా మాసిన గడ్డాన్ని అలవోకగా నిమురుకుని, భ్రుకుటిని సడల్చాడు. కుంకుమ బొట్టు మెరిసింది. యిందాకటి నుంచీ చెవులు దోర బెట్టుకుని, కళ్ళు మూసుకుని, శ్రావ్యమైన సంగీతం వింటున్నట్లున్న సత్యం కళ్ళు తెరిచాడు. సాంబయ్యగారి కేసి చూశాడు. తను యిందాకనే సమర్పించిన తాంబూలం అల్లాగే వుంది. కూర్చున్న సాంబయ్యగారు అల్లాగే ఉన్నాడు. గొంతుక పెగుల్చుకుని, 'అయ్యా! పంచమ భావం చూస్తారూ!'అన్నాడు.

సాంబయ్య కళ్ళు ఓసారి చికిలించి, 'బాబూ! మీకు యింకా పాతిక ముప్పయి లోపునేనే, అప్పుడే ఏం తొందర!' అన్నాడు. సత్యం

మాట్లాడలేదు. 'పంచమ భావాన్ని గూర్చి చూచేప్పుడు అటు ద్వితీయం, ఇటు సప్తమం గూడా చూడాలంటాను. వింటున్నారాండి.........ఈ జాతకానికి....'

'నాదేనండి జాతకం!' అన్నాడు సత్యం.

సాధారణంగా తమ జాతకాన్ని తమదే అని చెప్పటానికి సంకోచపడతారు జనం. అందుకూ 'యీ జాతకానికి' అని పల్లవి ప్రారంభించడం. కాక, 'ఈ జాతకానికి' అని చెప్పటం వాళీ. 'గడ్డం అంటే బొట్టు,అన్న సోది పద్ధతి కూడా పోటానికి ఇది వీలు. నాదే ఈ జాతకం అని చెప్పినవాడు, ఢక్కా మొక్కీలకు ఆగగలడన్న మాట—అనుకుని సాంబయ్య 'చిత్తం, అదే చెప్తున్నా. యీ జాతకానికి పుత్ర పుత్రికా సంతానం ఉంది. ఎవరెవరు, ఎందరెందరూ! అని ప్రశ్న! సహజం. యిద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. చిత్రం ఐన జాతకం సుమాండి—నలుగురి చేతా ఓహో అనిపించుకునే జాతకం గాని, మరోటా? సంతానం....కొంచెం ఆలస్యం. ఆలస్యమే మంచిది లెండి. యీలోగా నాలుగు తరహాలూ గమనించవచ్చు, స్తిమిత పడవచ్చు. ఏమంటారు?'

సత్యం వింటున్నాడు. అసలు అతను వచ్చింది యిందుకే. పుత్రప్రాప్తి ఉందా లేదా అనేది మనస్సును మథిస్తోంది. భార్య అయితే చాటుగా తన దగ్గిర వాపోయింది. తను ఏమీ పెదిమ విప్పలేదు. యింట్లో ఉయ్యాల ఊగడం, సన్న సన్న అల్లర్లూ, తను యింటి కొచ్చేప్పటికి నవ్వి వాటేసుకోవటం, ముద్దు పల్కులతో మురిపించటం—వీటి కోసం గుండె ఆరాటపడుతోంది. కనుక్కుంటే ఆలస్యం అని చెప్పారు ఒకరిద్దరు. వీరూ ఆ మాటే అన్నారు. యింకేం? కాక, సాంబయ్యగారు యిందాకటి నుంచీ చెప్పినవి అన్నీ యథార్థాలు అని హృదయం అప్పుడే

చెప్పేసింది. నిజం చెప్తారనే యింత దూరం తను వచ్చింది. 'చిత్తం, చిత్తం' అన్నాడు సత్యం.

'అసలు యీ జాతకంలో ఉన్నది ఒక్కటే గమత్తు.'

'చెప్పండి.'

'చిత్రం, చెప్తా. ఓ, యామైనా ఝంఝూమారుతంగా వెళుతుంది దశ!'

'గమత్తు ఏమిటంటారు....' జిజ్ఞాసతో అడిగాడు సత్యం.

సాంబయ్య నవ్వాడు.

'చెప్పండి.'

'యిల్లాంటివి గుండె నిబ్బరం ఉన్నవాళ్ళకే చెప్పమని శాస్త్రం.'

'ఫరవాలేదు. చెప్పండి....'

'చెప్తున్నా. చిత్రమైన శృంగారయోగం వచ్చిపడుతోంది!' నవ్వక, తుళ్ళక, యికిలించక, నిశ్చల దీపం లాగు ఉన్నాడు సత్యం.

సాంబయ్యగారు ఆగారు.

'చెప్పండి, చెప్పండి' అని కుతూహలం చూపాడు సత్యం.

'నాయనా! యివీ ద్వంద్వాల్లు. ద్వంద్వాలు దాటడమే యోగ్యత. తొందరపడకు మరి. నీవు ఎవరి మీద ప్రేమ కురిపిస్తావో ఆ స్త్రీ హృదయం నీమీద మనసుంచదు, పరాసక్త. నిన్ను మనసా తనవాడని ఎంచుకునే స్త్రీని నీవు కన్నెత్తి చూడవు!'

చాలదూ, చిత్రానికి!

సత్యం ముఖం వింతగా అయింది. 'వివరించాలి, వివరించి చెప్పం' డన[illegible].

'శాస్త్రం యింతే చెబుతుంది. సమన్వయం ఎవరికివారు చేసుకోవాలి. మాటవరసకు—నీవు మరొక స్త్రీ మీద ప్రేమ కురిపించవచ్చు: ఆమె నిన్నెరగనట్లుండవచ్చు!....'

'నేనింకో స్త్రీని ఎరగను.'

సాంబయ్య నిజమా అన్నట్లు చూశాడు.

'నిజం. నేను మరో స్త్రీని ఎరగను. వాంఛించలేదు గూడాను' అన్నాడు సత్యం. అతని కళ్ళముందు సీత కనబడుతోంది. యిన్నేళ్ళూ తాను గోతిలో పడ్డాడా? హృదయం కుంగుతోంది.... తన భార్య అనే కాక, సీత అనికూడా అతను అనుకున్నాడు. సీతనేగాని మరొకర్ని చేసుకోనన్నాడు, నెగ్గాడు.

'ఐతే మరొక స్త్రీ నీకయి తన హృదయాన్ని సమర్పించుతూందన్నమాట. శాస్త్రం తప్పదు!' అని దస్త్రంకట్టి పెట్టాడు సాంబయ్య.

కావాలని లేవలేక కూచున్నట్లు కూచున్నాడు సత్యం....

'మరింకా యేమైనా ప్రశ్నలు....?'

'లేవండీ!'

సత్యం బరువుగా లేచాడు. సాంబయ్యగారు....ఏదో చెప్పబోయాడు. అతని చెవికి ఎక్కలేదు ఆ మాటలు. తలవొంచి బరువుగా ఆలోచిస్తూ నడుస్తూన్నాడు.

సీత వెక్కిరిస్తున్నట్లు కనబడుతోంది. యిన్నాళ్ళూ, మరెవరో వాసన చూసిన తల్లో పూలన్నేనా, తను చూసి ఆనందించింది! కాఫీ హోటలులో రేడియో చెవుల్ని ఆపేస్తోంది. సన్నగా చినుకులు!! ఎవరో జనం ఈగలల్లే వస్తారు, ఏదో అరుస్తారు, వెళతారు. రోడ్డుమీద జనం ఎందుకో నడుస్తారు పోతాసు. సర్వర్ వచ్చి, ఏదో అడిగి, లాభం లేక వెళ్ళిన

సంగతి తెలీని స్థితిలో ఉన్నాడు. ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. పదిగంటలయింది. ఎటూకానివేళ. వచ్చినందుకు కాఫీ తాగేస్తే సరి—బిల్లు చెల్లించాడు. సిగరెట్లు కొన్నాడు. మళ్ళీ సిగరెట్లు మానేసిగూడా రెండేళ్ళయింది. అంటించాడు. ఘాటుగా ఉంది. రోడ్డున పడ్డాడు.

సన్నసన్న తుంపర ముదిరి జల్లువశకు వచ్చింది. తడవడం ఎందుకని యాదాలాపంగా హోటలులోకి వెళ్ళాడు. భోజనానికి ఎందరో టికెట్లు కొంటున్నారు. తనూ కొన్నాడు. వడ్డన అయింది. ఉల్లిపాయల పులుసు యింత వడ్డించి వెళ్ళాడు. పులుసు పెడితే, సీత పెట్టాలి, అమృతం. తనే నేర్పాడు. ముద్ద ఎక్కలేదు. విస్తరి నిండా కూరలు, పచ్చళ్ళు. ఓం ప్రథమంలో పులుసు. తనకు యిష్టమైనవే అన్నీ. నోటికి ముద్ద ఎక్కలేదు. ఏమీ అనలేడు. ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలో తోచదు. తడి బట్టను పిండినట్లు ఏదో గుండెను పిండేస్తోంది. అన్నం వదిలి, చెయి కడుక్కుని బయటపడ్డాడు. సిగరెట్ల మీద సిగరెట్లు దహిస్తూ కూచున్నాడు. తోచదు. కూచోలేడు. వాన వెలుస్తోంది. లేచాడు. నడవాలి. ఏదో చెయ్యాలి. హుఁ. యింత కాలమూ తాను నందనవనం అనుకున్నది నరకం అన్నమాట, నటన అన్నమాట. ఎంత గొప్పగా నటించిందీ....చాచి దవడపళ్ళు ఊడేట్టు కొడితే—ఇంత—ద్రోహమా? ఎవర్నీ కొట్టడం....తప్పు, ఛ. కొట్టడమా....సీతకు ఎదురుగా నవ్వుతూ నుంచుని, 'నాకు తెలిసిందిలే!' అంటే. ఇంకేముంది?....

'ఇంతకూ నిజం అంటావా?'

'ఎందుకు కాకూడదు?'

ఎవరూ లేరు. తానే ఇద్దరైనాడు. రెండోవాడి మాట అది.

'ఏమిటి కాగూడదు?'

'అబద్ధం'

'అబద్ధమా? వుత్తది'

'నీవు ఉత్త చెపల సన్యాసివి. ప్రతిదీ నీకు అనుమానమే.'

'వాడెవడో ఏదో అన్నాడని యిల్లా మల్లాగుల్లాలు పడుతున్నావు.'

'అంతేనంటావా?'

'అక్షరాలా. వాడి బొంద.'

'ఎందుకల్లా చెప్పాడంటావు. వాడికేమిటీ లాభం—యిలాచెబితే.'

'లాభంలేదు. నష్టంలేదు! వాడి కలా చెపుదామనిపించింది. చెప్పాడు. ప్రతిదానికీ డూడూ బసవన్నా అని తల ఆడించే వాళ్ళుంటే ఎన్నయినా చెబ్తారు.'

'నాన్సెన్స్. వాడు వయస్సు, అనుభవంఉన్న పెద్ద మనిషి.'

'కాదు. నీవు అయిదు రూపాయలు ఇచ్చి, యీ మాటను కొనుక్కున్నావు!'

'ఇందుకే వెళ్ళానంటావా?'

'ఆ. కాళ్ళుచ్చుకు లాక్కెళ్ళినట్లు వెళ్ళావు.'

'సంతానం విషయం కనుక్కుందామని.'

'శాస్త్రి చేశాడు.'

'........... '

'అయినా నీలో వుంది లెస్సూ. వాడెవడో అని విచారిస్తివి. వాడు చెడు చెప్పడంలో గొప్పవాడు అని చెప్పిరి నలుగురూ. అదే మన క్కావాలి అంటివి. వాడు ఖయాళీ అన్నారాయె. ఖయ్యాళీలే నిజం చెబ్తా రంటివి.... యిల్లా ఎవరెన్ని చెప్పినా, అదంతా ఓహోహో, భేష్. అదే మనక్కావాలి అని పరిగెత్తు కొచ్చావ్. అనుభవించు.'

'మన ఖర్మం ఇంతేనని అఘోరించమంటావ్?'

'నేను నీకు చెప్పనిక. చెప్పి చెప్పి విసుగేస్తోంది గూడాను.'

'మా బాబుగా, నీ మాట విననంటావా?'

'ఎప్పుడు విన్నావ్. ఎప్పుడూ వెలక్కాయి నొక్కినట్టు నా నోరు నొక్కి పారేశావుగాని?'

'తప్పు. క్షమించు. ఇక చూస్కో.'

'అయితే, వెళ్ళి, నీవు అంటే ఎవరు పడి ఛస్తుంటారో వారిని వల వేసి వెతుకు.'

'సాంబయ్య చెప్పింది నిజం అని నీవూ నమ్మావన్నమాట?'

'ఏం చెయ్యనూ. నా సొంత అభిప్రాయం ప్రకారం నమ్మను.'

'నీ అభిప్రాయం వివరిస్తావా?'

'ఆ. ఇదంతా తుడిచి పారేసేయ్ నీ దారిన నీవుండు!'

'మనస్కరించటం లేదు!'

'ఐతే అఘోరించు!'

'ఉపాయం ఏమీలేదూ....?'

'ఇక్కడే నాకు రేచిక్క రేగేది.... వాడెవడో అన్నాడని పట్టు కూర్చుంటావేం?'

వాన మళ్ళీ ముంచుకొస్తోంది. పాంపిల్లల్లాగా జలదార్లలో నీళ్ళు పోతున్నై. దగ్గర్లో ఉన్న గుళ్ళోకి దూరాడు సత్యం. అక్కడ ఒకాయన చేతులు చూసి చెప్తున్నాడు.

(13)

'చెయ్యి చూపించుకుంటే—' అనుకున్నాడు.

'ఐన శాస్త్రి చాలదూ?....' రెండోవాడు అన్నాడు.

'నా మాట విను. సుతరామూ కొట్టిపారెయ్యకు. జాతకానికీ, సాముద్రికానికీ ఈ తేడా ఉంది. మనం పుట్టిన టైమూ యివన్నీ సరిగ్గా లేక మన జాతకం గురికి బెత్తెడు ఎడం కావచ్చు. చెయ్యి అల్లా కాదు. చూడూ?'

'ఓరి ఓబయ్యో.... వీళ్ళకు భవిష్యత్తు తెలిస్తే వాళ్ళే బాగుపడుదురుగా.'

'ఖర్మం అల్లా వుందని తెలుసుకుని నిశ్చింతగా ఉన్నారేమో?'

'ఇక నీకు చెప్పి లాభం లేదు.'

సత్యం చూస్తూ అలాగే నుంచున్నాడు. 'ఏడిసినట్టుంది. అన్నీ అబద్ధాలే. గంజాయి ముండా కొడుకు!' అంటూ చేయి చూపించుకున్న ఆసామి చెయి దులుపుకుంటూ లేచాడు. నవ్వి, పళ్ళికిలిస్తూనే మరోడు చెయ్యి చాపి ఆయన ముందు కూచున్నాడు. సత్యం అప్పుడే అంటించిన సిగరెట్‌ను విసరి పారేసి రోడ్డు పట్టాడు.

తను యివాళే బయలుదేరి యింటికి వెళ్ళాలన్న మాట గుర్తొచ్చింది. యామైనా వచ్చి తీసుతానని చెప్పాడు. సీతతోనే గదా.... ఏం వెళ్ళకపోతే. అలాంటి దానితో చెప్పినట్లు నడుచుకోవాలి గూడాను?

'తప్పకుండా వస్తారు గదూ?' అంది కళ్ళల్లోకి చూస్తూ.

'ఆ' అని పుట్టింటికి పంపాడు. తను యిల్లాగ వచ్చాడు. బర్రుమంటూ బస్సు వచ్చి యింత బురద చిమ్మి వెళ్ళింది. తన బట్టలు చెడ్డాయి.

జట్కాబండీ రాచుకుంటూ వెళ్ళింది. వెంట్రుక వాసిలో తప్పిపోయింది గాని మోపైన దెబ్బ తగిలేదే. పైగా జట్కావాడి సాధింపు. సత్యం అలాగే తన బసకు చేరాడు. హోటల్ గణ గణ మంటోంది.... గది అంతా అధ్వాన్నంగా వుంది. అద్దంలో తన ముఖం పీక్కుపోయి నట్లుంది. తల పగలేస్తోంది. నాదు. పెందరాళే యింటికి చేరితే నయం. మంచాన పడతానో ఏమో గూడా. ఖర్మ అనిపించింది. ఎందుకు యింటికి వెళ్ళడం? దొంగ ప్రేమలూ, నటనలూ చూడ్డానికేగా. అంతకన్నా ఏ కాశీ రామేశ్వరాలకో లేచిపోతే నయం.

దాన్ని ఇంక లాలించే దెవరో....? ఎవడో వెధవ. అమేధ్యం అని తెలిశాక రాయివెయ్యడం దేనికి? మంచంమీద వాలాడు. ఇళ్ళోఇళ్ళో అనుకున్నాడు. మసక మసకగా, మబ్బుమబ్బుగా, కునుకు, కల.

'ఏమండీ—ఏమండీ....' సీత.

'ఏం?'

'పండక్కి ఏం తెచ్చారు?'

'పరుపుకింద ఉంది చూసుకో....'

'నిజంగానా ... నిజంగానా....' పరుపు కిందనుంచి కొరడా తీసి, 'యిదేమిటి... యిదెందుకు.' అంది.

'నిన్ను ఉతకటానికి' అందా మనుకునిగూడా, 'నీ చేతికిచ్చి ఉతికించుకోడానికి' అన్నాడు.

'యివేం మాటలండీ!' అంది సీత. సీత వీపు—అందం చిందినట్లుండే వీపు రెవికలోంచి మెరుస్తోంది. యింతలో సీతను ఎవరో పిలిచారు.....'సీతా!' ఆగింది—'నేనంటే అసహ్యమా?'

తలుపు దడదడమని ఎవరో బాదారు. బాత్తున్నారు. లేచి తలుపు తీశాడు. ఎవరో పక్కగదికి వెళ్ళడానికి బదులు ఈ గది తలుపు బాదారు. మళ్ళీ నిద్ర పట్టలేదు. ఎకాఎకిని తన సామాను సర్దుకున్నాడు.

'ఆగు!' తన రెండోవాడు.

'ఏం?'

'యివాళ కదలకు, రేపు ప్రయాణం.'

'ఏం కథ?'

'యివాళ వెళ్ళి యింట్లో ఏం ఉపద్రవం తెస్తావో?'

'నేనసలు యింటికెళ్ళను....కాని గంతలకు—కాదు, మా చెల్లెలి గారింటికి—'

'ఐతే—మగాడివే!'

'మాట!'

తన రెండోవాడు ఐపులేడు. హోటలు వాళ్ళకు లెక్క యిచ్చేసి జట్కాను పిలిచాడు. రైలు స్టేషనుకు వెళ్ళి, ఏ రైలు పోబోతూంటే ఆ రైలు ఎక్కుతాడు తను.

'ఎక్కడికి సామీ?' జట్కామనిషి.

'బస్స్టాండుకు'

జట్కాబండీ కదలబోతోంది. వద్దు. సరెలే. ఎవరో యీడ్చుకు పోతున్నట్లుగా వుంది తనకు. నేరుగా వెళ్ళి బస్సులో కూచున్నాడు. బస్సుకదిలింది. వికారం. యమయాతన వేరే అక్కరలేదు. అంతా ఇక్కడే అనుభవిస్తున్నా అనుకున్నాడు. కుదించి, ఎత్తెత్తి పడేసి, ఈడిగిలబడి, సాగి—మారాం చేస్తూ బస్సు పోతోంది. బస్తాలో కూరిన దూదిలాగుంది లోపలి ప్రజ. దీపాలు పెట్టబోతారు. సత్యం బస్సు దిగాడు. చీకటీ, వెలిబూడిదలాంటి వెలుతురూ యుద్ధం చేస్తున్నట్లుంది. కండెలు అమ్ముతున్నారక్కడ. మరో బస్సు రావాలి. 'సీత ఈ పాటికి ఏం చేస్తుంటుందో!' మనస్సును ఆపలేకపోయాడు. ఇంకా అరగంటకి

ఎ.పి. ప్రాచ్య గ్రంథాలయము
ప్రవేశ సంఖ్య



గాని బస్సురాదు. కండెలు అమ్మేచోట జరుగుతున్న గమత్తులు చూస్తు న్నాడు. పసివాళ్ళ ఏడుపు, పెద్దవాళ్ళ బేరాలు, కాలీకాలని కండెల్ని యివ్వడం, అణాలు సంచీమడత కింద వెయ్యడం—రద్దీగా వుంది. కోరంటికంలాగా చలిగాలి. బస్సొకటి వచ్చింది. అత్తారింటి ముఖమై వెళుతున్నాడు సత్యం.

'సీత ఏం చేస్తూంటుందో...?' తనకై ఎదురు చూస్తూంటుందేమో! ఏమో—యీవేళ రాకపోతే మంచిదని మనసులో ఓ దణ్ణం పెడుతూం టుందో! చీకట్లు అలముకున్నై. బద్ధకస్తుడి బుద్ధిలాగా తీవ్రంగా పోతోంది బస్సు. కారాపి. ఎవరో ఒకామె ఎక్కింది. ఆ చీర రంగు కారు దీపం ముందు ఎంత బావుందని. జానక్కి యీ రంగు చీరలిష్టం. జానకి, పాపం ఎక్కడుందో—ఏం చేస్తోందో.... జన్మంతా ఏడవటానికి పుట్టింది జానకి. పాపం, తాళికట్టినవాడు, —ఎందుకులే—జానకి మంచి తనం, చక్కదనం అంతా భస్మహవ్యం అయింది. బస్సు ఆగింది. నేలంతా తడి. బాగా వాన కురిసినట్లుంది. తన సామాను తీసుకొని కది లాడు. కంకరాళ్ళు కుక్కపళ్ళల్లే గుచ్చుకుంటున్నై. రోడ్డు అయింది. బురద. హోల్డాలును నెత్తినెట్టుకుని, ఊతంగా అడుగులేస్తూన్నాడు. గుళ్ళ దగ్గిరకొచ్చాడు. సంగీత విద్యార్థి ఎవరో జంటస్వరాలు వీణమీద స్ఫురితం గమకంలో సాధన చేస్తున్నాడు. సాసాలమధ్య 'ని' అనుమా నంగా తలఎత్తి దించుకుంటోంది. చీకటి దీపాన్ని కమ్ముకుంటూన్నది. దారంతా ఒకటే బురద. రావిచెట్టు దగ్గిర మలుపులో కింద పడవల సిందే—

సత్యం అత్తారింటికి చేరాడు. చీకటి గుయ్యారంగా వుందిల్లు..... సకిలించాడు.

'ఎవరదీ?' ఒక గొంతు.

ఎవరువార్తనైనాకాదు.

'నేనే' అన్నాడు.

అత్తగారు దీపం పట్టుకు వచ్చింది. 'మీరా!' అంది. మరదలు నీళ్ళు తెచ్చింది. కాళ్ళబురద వదిలేసరికి బ్రహ్మప్రళయం ఐంది. సీత ఏదీ?

అన్నంతిని వచ్చిన చిన్న తమ్ముడికి కథలు చెపుతూంది. విని, లేచి వొచ్చింది. నవ్వుతూ, 'ఇప్పుడేనా రావడం!' అంది. ఏం నటన? ముభావంగా 'ఊ' అన్నాడు సత్యం. గూట దీపం—నోట అన్నం ఆ యింట్లో. తన మామగారూ, రామ్మూర్తీ వచ్చారు. రామ్మూర్తి సీత మేనమామ. తన యీడు వాడే.... వొస్తూనే రామ్మూర్తి 'సీతా!' అన్నాడు. ఆ పిలుపు అతిచనువుకు చిహ్నం.

'దొంగ దొరికాడు!' అనుకున్నాడు.

'మేనమామ మరి....' అన్నాడు తన రెండోవాడు. యీ రెండోవాడు చిత్రమైన సన్యాసి. పిలిస్తే పలకడు. వాడి చిత్తం వొచ్చినప్పుడు ఊడి పడతాడు. 'గయ్యాళి ప్రేయసికంటే కనా కష్టం.'

'అందుకే—అందుకే—' అన్నాడు సత్యం.

'నోరుమూసుకో! రొష్టుపడకు!'

'మీ ఆయన్ను మడికట్టుకో మనవేమే?' రామ్మూర్తి ఏం అధికారం చెలాయిస్తున్నాడు!

కానీ— కానీ— తొందరపడి రొష్టు పడగూడదు. ఔచిత్యం కాదు. ఔచిత్యం ఎంత గమత్తయిన మాట!

ఆనాడు, గుడివెనకాల మిత్రమండలి కలిసింది. నలుగురు మగ పురుషులు కలిశాక—చేసేదేముంది.. ఫలనావారిల్లాగా! అనేగదా. నరసింహా

రావు మాట వచ్చింది. నరసింహారావు అన్ని విధాలా యోగ్యత కల వాడు. గొప్పవాడు. రామబ్రహ్మం భార్యాప్రియుడు అన్నదితప్ప, రామ బ్రహ్మమూ తగ్గవాడే....'సుశీల' అంటే పడిచస్తాడు. ఒక యింట్లోనే వున్నా. రామబ్రహ్మమూ, భార్యా, నరసింహారావూ, ఏ ఒక్కనాడూ ఏమీ లేనట్టు ఎరగనట్టుంటారు. ఎవరెవరి పనులు వాళ్ళు చూస్తారు.... యీ కథంతా విని—వేదాంతిగారేమన్నారూ—వాళ్ళకు ఔచిత్యం తెలుసునట్టా! మంచో చెడో జరిగింది. జరుగుతూంది. జరుగుతుంది. కానీ నొప్పించడం, అల్లరి చేసుకోవడం, గత్తరా లేదు. ఔచిత్యపరులు వాళ్ళు.

'యిదా ఔచిత్యం—' అన్నాడు తను.

'కాదా....?' అని రెట్టించి వదిలారు వేదాంతిగారు.

సత్యానికి అప్పుడూ, అది గుర్తుకువచ్చి యిప్పుడూ నవ్వు వచ్చింది. అన్నాలయినై. ఆడవాళ్ళు భోజనాలకు కూచున్నారు. 'రావోయ్ సత్యం'—రామ్మూర్తి ఎంత గుండెలు తీసిన బంటు! సంకోచం గూడా ఏమీలేదు.

'ఏమిటి విశేషాలు?' అతనే.

'ఏమున్నై....?'

'నీ ఖరీదైన సిగరెట్టు యిల్లాతే.'

'తీసుకోండి. యిదుగో....'

'ఈ దసరాలకు ప్రోగ్రాం ఏం వేశావ్....? మైసూరేమన్నా వెళ్తావా?'—సత్యం నవ్వాడు.

రామ్మూర్తి అవీ యివీ మాట్లాడి, ఆవులించి చిటికవేసి పడుకున్నాడు. మామగారు మితభాషే. రోజుకు నాలుగో అయిదో మాటలు ఆయన మాట్లాడేది. కాలుతున్న సమిధను విసిరి పారేసి గదిలోకి

వెళ్ళాడు. కలంకారీ దుప్పటి ఇస్త్రీది పక్క వేసి ఉంది. దీపం ప్రపుల్లంగా వెలుగుతోంది. సత్యం వెన్ను వాల్చాడు. తల్లీకూతుళ్ళు ఆ మాట యీ మాట నెమ్మదిగా అనుకుంటూ భోంచేస్తున్నారు. యిదీ వరస. ఏ వేళకూ తెమిలిరాదు. నిద్ర ముంచుకు రాబోతోంది. సత్యం నిద్రకు స్వస్తి చెప్పాడు. ఎలా కోత ప్రారంభించడమా? అనుకుంటున్నాడు.

'భార్యకు దండంబు పడకకు వెలిచేత.' రెండోవాడు.

'మరి శరీరం అలుపు తెచ్చుకోమంటోంది!' సత్యం.

'నిగ్రహం, నిగ్రహం అనంటావే—ఇదీ నిగ్రహపు వేళ.'

'మంచి సలహా చెప్పావ్.'

'ఏం లాభం....నిమిషం—నీవు తృణీకరించడానికి.'

'నీ దుంపతెగా. ఎప్పుడూ నామీదే కత్తులు దూస్తావేం....?'

రెండోవాడు తలవొంచి తప్పుకున్నాడు. మంచినీళ్ళ చెంబుతో సీత చక్కా వొచ్చింది. ఎదురుగుండా వెళ్ళ చేతులు చాచేవాడే. నిబ్బరించు కున్నాడు. తలుపు గడియపెట్టి సీతే వచ్చింది....తమలపాకులు తీసుకొని చిలకలు చుట్టింది. ఇచ్చింది.

'భోజనమైన గంటకు—' అన్నాడు.

'ఇద్దరం కలిసి వేసుకుందా మనుకున్నానండీ!'

ఓరచూపు చూసింది. సత్యం గుండెలు జల్లుమన్నై. నటన అయినా ఎంత మనోహరం, నటన అని తెలీకపోతేను. తెలిశాక నిస్సారమేకాక కారం కూడాను.

'ఏం అలాగున్నారు?' సీత.

'ఏం, ఎలాగున్నాను?'

'ప్రయాణంవల్ల కాబోలు— ఏమిటోగా వున్నారు.'

ప్రతిదీ తను ఎవరికి చాటులేకుండా చెబుతూ వచ్చాడో——ఆ మనిషి—పక్కలో తాచు—శత్రుపు. చూస్తూ ఊరుకున్నాడు.

'ఏం జరిగిం దేమిటీ?'

'ఏం జరగ లేదే.'

అబద్ధం యీ మాత్రం తెలుసుకోలేరా అవతల వాళ్ళు.

'సరే, మీ యిష్టం' అని చోటు చేసుకుని పక్కమీదే వాలింది. ఆడవాళ్ళు—అబ్బ, ఎంతకైనా తగుదురుసుమా. మాట అనటానికి వీలు లేకుండా, మాట మన మీదే ఉంచి మెసులు కొస్తారు. మౌనం సర్వార్థ సాధకం అనుకున్నాడు సత్యం.

సీతే చొరవ చేస్తుంది, గాండ్రించ వచ్చనుకున్నాడు. సీత ఆవు లించి, 'పొద్దుటినించీ రెక్కలు విరుచుకున్నాను. నిద్ర వస్తోం' దని పడు కుంది.

నిద్రరాక. నిద్రపట్టక. నిమిషాలు లెక్కపెడుతూ మేలుకు కూచోలేక, నిద్రపోయేదాన్ని లేపి ఓ ధణుతెగర గొట్టాలనుకుని, రుజు వేముందని మళ్ళీ పస్తాయించి, చూదాం చూదాం అని చూసే ఓపిక చిక్కపట్టుకోలేక, సత్యం ఓ రాత్రి నిశోయిం తర్వాత కునికాడు.

తెల్లవారింది. సీతే లేపింది కాఫీ చల్లారుతోందని. తాగి, పొగ పీలుస్తున్నాడు. సీత పనిలో పడింది. పిల్లలకి చద్దెన్నాలు పెడుతోంది.

నెమ్మదిగా రత్తయ్యగారింటికి కదిలాడు. బురద కాస్త ఆరి అడు గులు పడుతూన్నై. ఆ అడుగుల్లోనే తాను అడుగులేస్తూ రత్తయ్య యింటికి చేరాడు.

'ఎప్పుడొచ్చావురా? రాత్రేనా?'

ఆప్యాయమైన పిలుపు.

'ఊఁ!'

'దా, సావిట్లో కూచో.'

నులక మంచం వాల్చుకుని కూలబడ్డాడు సత్యం. బారెడు చుట్ట ముట్టించి ఒకతనున్నాడు. జానకి వొచ్చింది. పాల సముద్రంలోంచి లేచి వచ్చిన లక్ష్మి లాగుంది.

'ఎప్పుడొచ్చావయ్యా....?'

'రాత్రి'

'అంతా క్షేమమేనా....?'

'ఆ'

'పేట నుంచేనా? మీ అన్నయ్య కనిపించారా....?'

అన్నయ్యంటే జానకి భర్త. అది వరస.

'ఊఁహుఁ'

'ఈ పాడు చుట్టలు మానుదూ.... కొంపంతా ఒకటే నుసీ—మసీను.'

నవ్వాడు సత్యం. ఎంతో యిష్టం ఉంటేకాని, వ్యసనాన్ని మానమనరు. ఉన్న వ్యసనాన్ని మన్నించేవారో మరి.... ఆలోచిస్తున్నాడు. యిప్పుడే వస్తారా అని ఆ చుట్ట ఆసామీ, రత్తయ్యా ఎక్కడికో వెళ్ళారు.

'మీ అత్తగా రెక్కడమ్మా?'

'రావాలి. ఊళ్ళో లేదు.'

తెలిసింది. ప్రస్తుతం అంత యింట్లో తనూ, జానకీనీ.

'ఏమిటయ్యా విశేషాలు?'

'నువ్వే చెప్పాలి.' నవ్వాడు. అసందర్భంగా వుంది ఆ నవ్వు. జానకి గమనించిందో లేదో తెలీదు. జానకిని చెప్పవాల్చకుండా చూస్తు న్నాడు సత్యం.

'అట్లా చిక్కిపోయావేం?'

'ఎవ్వరికీ చిక్కలేదే యింకా....'

జానకి నవ్వింది. నవ్వినప్పుడు జానకి ముఖం విప్పారిన పెద్ద చామంతి పువ్వులా వుంటుంది. ఆ నవ్వు అంటే సత్యానికి ప్రాణం. ఆ నవ్వుముఖం కోసం అతను ఏ పనైనా చెయ్యగలడు. ఆత్మీయత, ప్రేమ ఉన్నచోటే అలాంటి నవ్వు వస్తుంది. తన భార్యతరపు బంధు వైనా, తనకు జానకి ఆత్మీయురాలే. తనదే. జానకి నవ్వుముఖాన్ని గూర్చి తను లోగడ చెప్పినప్పుడు సీత ముఖం ముడుచుకుంది. ఊఁ— అవంతే.

'నవ్వితే ఎంత బావుంటావని!'

యీ మాట ఎన్నిసార్లో అన్నాడు తను జానకితో. యిన్నిసార్లూ ఆమాట తోచేది; అనేశాడు. యీసారి తన గొంతుక తనకే మారినట్లు అనిపించింది. జానకి తల ఎత్తి చూసింది. తల వొంచి మళ్ళీ చాటలో బియ్యం ఏరుతోంది. వీధిలో ఎవరో నడిచివెళ్ళిన అలికిడి అయింది. జానకి తల ఎత్తింది తన మాటకా, ఎవరో వస్తున్నారనా....?

'సీత బాగుందా....?' జానకి.

అడిగిన తరువాత తోచింది. మంచంమీద కూర్చున్నవాడు లేచి— దగ్గిరికి వెళ్ళి ముంగాళ్ళమీద కూర్చున్నాడు. జానకి ఓరకంటితో చూస్తూనే బియ్యం ఏరుతోంది.

'ఎందు కిప్పు డవన్నీ—'

కళ్ళు మసక అయినప్పుడు మగగొంతుక అనేమాటే అది! ఎందరెందరు జాణలు, అమాయకులు యీ పల్లవి పాడి వొదిలారో! జానకి ఏమీ మాట్లాడలేదు. నవ్వలేదు. తనను అర్థం చేసుకుంటోంది. తనంటే ప్రేమకురిపించే స్థలం ప్రత్యక్షమయింది. జోస్యం అబద్ధం కాదు. అబద్ధమే అయితే— తిట్టేవాళ్ళు వెళ్ళి మళ్ళీ మళ్ళీ జోషీలకు ఎందుకు ముడుపులు చెల్లిస్తారు?

జానకి బియ్యం ఏరటం పూర్తిచేసి లేచింది. సత్యం మళ్ళీ సిగరెట్టు అంటించాడు. బీరుగ్లాసు ముందెట్టుకుని ఆరగారగా గుక్కెడు గుక్కెడు గొంతుకలో పోస్తున్నట్లుందిగాని— మామూలుగా సిగరెట్లు త్రాగే ధోరణి కాదు.

'రత్తయ్య బాబాయి వొస్తే బాగుండును.'

జానకి వడమటింట్లోకి వెళ్ళింది. ముభావంగా వుందేమిటి చెప్మా....?

'రత్తయ్య బాబాయి ఎప్పుడొస్తాడమ్మా....?'

'భోజనానికి వొస్తారు....'

బిందెలో బట్టలు పెట్టుకుని చెరువుకు బయలుదేరుతోంది జానకి. సత్యం మనస్సు గంతులేస్తోంది. మనసులో మాట గబగబా చెప్పేస్తే...

'ఉండవమ్మా ఓ నిమిషం.... ఎప్పుడూ వుండేదేగా ఆ పని.'

'పొద్దెక్కటంలేదూ.... పని పేరుకొచ్చుంటే మాత్రం....'

గంపంత వెళ్ళబోసుకుందామని కూచుంటే, ఇప్పుడే వస్తాగా అని మరిపించి, పసిబిడ్డను మురిపించి వెళుతున్నట్టుగా వెళతోంది! గొంతుకలో వుండ ఏదో అడ్డుపడ్డట్లు తనకే అనిపించింది. 'సరే వొస్తా' అని బయలుదేరాడు సత్యం.

దారిలోనే బావమరిది ఎదురైనాడు. మెళ్ళో వెండికంచె ఎండలో మెరుస్తోంది.

'ఎందాకా....?'

'నీకోసమే—'

'పద....'

గోడకు పిడకలు కొడుతూన్న వొకావిడ మెడచాచి చూసి, 'ఎప్పు డొచ్చా వబ్బాయ్' అంది. 'నిన్నండీ' అని సమాధానం చెప్పి కదిలాడు. దారిలో ఎవరో అపరిచితముఖం కుశలప్రశ్నలు వేసి మరీ విడిచాడు. బురద అడుసైే అడుగులు పడ్డవి. నెమ్మదిగా ఆలోచిస్తూ సత్యం అత్తా రిల్లు చేరాడు. సీత ఎవరిమీదో కొరకొరలాడుతోంది. చెరువులోంచి అప్పుడే వొచ్చింది కాబోలు, నీళ్ళు ఓడుతోంది....

'పెత్తనా లయినాయా?'

'ఏమిటా గీర్వాణం?'

'మీ జానకి వొదిన ఏమంది?'

'నిన్నడిగింది,'

సీత నవ్వాపుకుంది. అత్తగారు ముఖం ముకటించుకుంది.... రామ్మూర్తి ఇంతలో ఎక్కణ్ణుంచో ఊడిపడ్డాడు. 'ఏమే అమ్మాయ్!' అంటూ. 'యిప్పుడే వెళ్తావుట్రా' అంటూ అత్తగారు హస్త రిస్తోంది. 'వెళ్ళాలి! వెళ్ళాలి!' అంటూ అతగాడు తయారౌతున్నాడు. పొడిబట్టలు కట్టుకొచ్చి సీత, 'అందర్నీ అడిగానని చెప్పు మామయ్యా' అంది. రామ్మూర్తి స్నానానికి లేచాడు. ఏదో పనిమీద వొచ్చినట్లు వొచ్చి, 'మీరు గూడా స్నానం చెయ్యరాదూ....' అంది. తనేం తోడి పెళ్ళికొడుకా....?

'మీ బావ వొచ్చేదాకా వుండవ్రటా....?' అత్తగారు.

'ఊహుఁ, వీల్లేదమ్మా....'

అవును యింకావుంటే అనుమానానికి వీలు. తెలివిగా ప్రయాణం పెట్టుకుంటున్నాడు.

'యీ మురికివానలకు యిల్లూవాకిలీ యామైనయ్యో........' రామ్మూర్తి.

'ఏమీ కావు. అక్కడే వుంటై యిల్లూ, వాకిలీ.'

సీత నవ్వింది. తన మాటకే నవ్వింది. నాయనమ్మా.... అని ఎద్దేవాచెయ్యడం కాదు.

రామ్మూర్తి పట్టుపంచ కట్టి జంధ్యాలు సవరించుకుంటున్నాడు. సీత మొగుడి దగ్గిర కొచ్చింది. నటన. ఎవరెరగరు? కాపరానికొచ్చి ఎన్నేళ్ళయినా పుట్టింట్లో కొత్త కొత్తగా వుంటం నటనా, నటనన్నరా

'వేణ్ణీళ్ళు తోడనా?....' సీత.

'వద్దు. ఆకలి లేదు.'

'ఏం?'

'నిన్ను చూస్తుంటేనే కడుపు నిండుతోంది?'

'స—దే' నని మెల్లిగా అని సీత కదిలింది. తను చూస్తున్నాడు. గబగబా వెళ్ళి, మేనమామకు కుంభం తోడుతోంది. వెధవ సంబంధాలు. ఆస్తిచూసో, పొలం పొలం కలుస్తాయనో, ఏకపుత్రుడనో, మేనరికమనో తొందరపడి ముడెట్టేదీ....తరువాత నిజస్వరూపాలు చూపించేదీ....? లోపల మేనమామ మాటలకు కిచకిచలాడుతోంది. వడ్డీతో సహా ఆనిక్క ముట్టచెప్తూంటే అప్పుడు—యిప్పుడెందుకు? రామ్మూర్తి బకాసురుడు నిమిషంలో అశనధ్వంసం చేసి చక్కా వచ్చాడు. చెయ్యి కడిగి—

'ఏమయ్యా సత్యం.... మీ రిద్దరూ మా ఊరుకు రారూ?' మధ్య తనెందుకు.?

'నిన్నే సత్యం?'

'నేనెందుకు, దాన్ని తీసికెళ్ళండి కావలిస్తే!'

మానుషం వుంటే, కుళ్ళి చావొచ్చు!

'అఁహ. అదేం మాట, మీ రిద్దరూ రావాలి. ఏమోయ్ సత్యం' మీ రిద్దరూ వచ్చి నాలుగు రోజులుండి రారాదూ?'

తనకే అక్కడికి పనివున్నట్లూ, యివతల వాళ్ళు ప్రతిపాది నక్షత్రాల్లాగ తిరుగుతున్నట్లూ. ఎవరెరుగరూ ఈ గడుస్తనం. 'అందరం కలిశాం గనక—మీరే నాలుగు రోజులుంటే బాగుంటుంది!' అన్నాడు సత్యం.

'మామయ్య ఎందుకుంటాడూ?....అత్తయ్య కోసం బెంగ పెట్టుకున్నాడు!' అంది సీత.

'నిన్ను చూస్తూంటే ఆ బెంగపోదూ?' అన్నాడు తను. సీత వినిపించుకోనట్లు చక్కా పోయింది.

'వస్తామరి! యీ సారైనా మీరు రావాలబ్బాయ్' అని రామ్మూర్తి లేచాడు. ఎదురుగుండా మామగారు వొస్తున్నారు. శకునం బాగానే వుంది అని నవ్వాడు తను. రామ్మూర్తి నవ్వలేదు. పరధ్యానంలో వున్నట్లున్నాడు. ఎంత జోరు చూపించబోయినా సూర్యుడు, ఎండకు చురుకుదనం రావటం లేదు. కూచుని లేచి—రామ్మూర్తి "వెళ్ళొస్తానయ్యా బావా!" అని కదిలాడు. ఆ పళంగా మామగారు ఉగ్రుడైనాడు. 'యిదే మీ జాతిలో ఉంది. ఎన్ని విధాల చెప్పినా వినవ్. అక్కడేదో పాసిపోతుందంటావ్——చాల్చాలు. ఉండరా అంటే ససేమిరా ఏమిటి? అంటూ.'

'ఈయన గూడా మాటల జోరు ఉందే. తెలుకుట్టినా బిగ్గరగా ఎవరికీ చెప్పడనుకున్నాను!' అనుకుని చూస్తున్నాడు సత్యం.

'వొస్తానయ్యా' అని రామ్మూర్తి కదిలాడు. వెళ్ళాడు. అవును. యిహ వుండడం ప్రమాదం అనుకున్నాక మనిషి నిలవడు.

సత్యం మధ్యాహ్నం నిద్రతీసి లేచేసరికి యిల్లు సందడిగా వుంది. మొగుడు నిద్ర లేచాడని చూసి సీత యిన్ని కాలిన మొక్కజొన్న కండెలు తీసుకొచ్చింది. సత్యం సీతను అదేపనిగా చూస్తున్నాడు!

'చూస్తారేమండీ—నమిలి పారెయ్యక?'

'ఈ సరదా రామ్మూర్తి ఉన్నప్పుడు యామైందీ? వాడు వెళ్ళనే వెళ్ళాడు. యిక వీడు అని తంతు మొదలెట్టిందా? ఆడవాళ్ళు! అసాధ్యులు' అనుకుంటూనే సత్యం నోటికి పని చెప్పాడు. వేడి వేడి కాఫీ తాగి, తలదువ్వి, నీటుగా బయలు దేరాడు.

'పెందరాళే రండి?' అంది సీత ముద్దుగా.

తల ఊపి వీధిలోకి వచ్చిపడి కరణం యింటికేసి వెళ్ళాడు. ఆ యిల్లొక నిత్యకల్యాణ వేదిక. ఆ ఎత్తరుగుల యిల్లు కళకళ లాడుతూనే వుంటుంది. సత్యం వెళ్ళేసరికి కుదేలు బేస్తులు జమ్మంటున్నాయ్. రాగానే ఆప్యాయంగా, ఓ చెయ్యి యివ్వబోయారు. వద్దని తనే కూర్చున్నాడు. కరణంగారు, భారీగా ఉన్న చుట్టకాడి దులిపి, కాండ్రించి ఊమ్మేసి చేవరస కొట్టేసి తీరుతానన్నాడు. సత్యాన్ని పలకరించాడు. 'అమ్మాయ్' అని గాండ్రించి ముక్కలు తీసుకుని కళ్ళు చిట్లించి 'అల్లుడు వచ్చాడు' అని రెండోవిడత ముక్కలు తీశాడు. సత్యం లోపలికి వెళ్ళాడు. వరసవరసగా పలకరింపులు అయినై. కరణంగారమ్మాయి వీణ నేర్చుకుంటోంది. మేడ మీద గదిలోకి తీసుకెళ్ళి వీణ చూపించింది. అంతకుముందా గదిలోకి తను వెళ్ళలేదు. అదొక అజంతా కుడ్యం. రెండు వీణలు, పులిచర్మాలు,

గోడలమీద త్రివర్ణ చిత్రాలు. సతీదేవిని బుజాన వేసుకున్న శివుడు కొండలలోంచి బరువుగా నడుస్తున్నాడు. మహాకాముకుడు వేణుగోపాలుడు ఓరకంటితో రాధతో మేలమాడుతున్నాడు. సంధ్యాతాండవ పండితుడు మహాదేవుడు నర్తిస్తుంటే అందరూ తైతక్కలాడుతున్నారు. తనూ ఉన్నానని ఎద్దు గూడా పరవళ్ళు తొక్కుతోంది. వో మూలవున్న తబలాకు సిల్కుతో మూత మూశారు. ఓపక్క తంబూరా నిలబెట్టి వుంది. కిటికీకి పక్కనే పొడుగాటి బల్లా—కిటికీలో పుస్తకాలూ ఉన్నై....

'ఈ వీణ మా మాస్టరుగారికీ —— యిది నాకూ' కరణంగారి అమ్మాయి.

'బావుంది....కృతులదాకా వొచ్చిందా చదువు?'

'అప్పుడే?—గీతాలు చెప్పుకుంటున్నా.'

సత్యం కిటికీలో పుస్తకం తీశాడు. భర్తృహరి. పుస్తకం ఛరాల్న తీయగా యీ శ్లోకం కనపడింది.

"ఏతా హసంతి చ రుదంతి చ కార్యహేతోః

విశ్వాపయంతి పురుషం నతు విశ్వసంతి

.... .... .... .... ....

నార్యః స్మశాన సుమనా ఇవ వర్జనీయాః"

తాత్పర్యం చదువుకున్నాడు. మనస్సు బరువెక్కింది. యింతలో కరణంగారే వచ్చారు 'ఏమోయ్! వీణ ఎల్లావుందీ?' అంటూ.

'దివ్యంగా వుంది!'

'ఏమిటి భర్తృహరా....గొప్పవాడు. ఏమన్నాడో చూశావా? "యౌవనం వా వనంవా" అన్నాడు. అమ్మాయ్, వీణ వినిపించవా?,

(14)

అన్నాడు. అమ్మాయి సిగ్గుపడింది. సత్యం మర్యాదా మందాహాసం చేశాడు.

'ఊఁ, ఏమిటి విశేషాలు?' అని కరణంగారే ఉపక్రమించి 'నాలుగు రోజులుంటావా?' అన్నాడు.

'వెళతా.'

వెళతానని ఉంటం సుఖం.

ఆ మాటా యీ మాటతో యిద్దరూ కిందికొచ్చారు. అరుగుమీద పురాణం యమగా సాగుతోంది. బేస్తూ అని పారెయ్యవలసిన ఆటల్ని ఆపి కుదేళ్ళు పంచుతున్నారు. కరణంగారు మళ్ళీ ఆటలో మునిగారు. యీలోగా కాఫీ ముగించి, పైకొచ్చి అతిథిని పలకరించి మళ్ళీ ఆటలో దూరాడాయన. అత్తారూరని ఎగడ్డమేగాని, పొద్దు పోవటం కష్టం. సత్యం నెమ్మదిగా కదిలాడు. పటంలోని వేణుగోపాలుడు కళ్ళకట్టినట్లున్నాడు.

'అప్పుడే యింటిమీద యావ పోయిందీ!' కరణం.

సత్యం నవ్వాడు. కదిలాడు. మబ్బులు....కలుస్తున్నై. విడిపడుతూన్నై. సేనల్ని కూర్చుకుంటున్నట్లున్నై. గాలి మన్మథ బాణంలా తగులుతోంది. జానకి యింట్లోనే ఉంది. రత్తయ్య వాకిట్లో కూర్చుని బూతులు మహాశుద్ధిగా అంటున్నాడు. ఎవడో కుర్రాడు యికిలిస్తూ వింటున్నాడు. జానకి సత్యాన్ని చూసింది. మొహం విప్పారనూలేదు. మూతి ముడకటించుకు పోనూలేదు. తనేవెళ్ళి సావిట్లో నులకకుక్కి వాల్చుకున్నాడు.

'ఒరే సత్యం, ఓ సిగరెట్టివ్వరా!' రత్తయ్య.

యిచ్చాడు.

'ధరెంత?'

'మూడుకాన్లు.'

'ఒక్కొక్కటి మూడుకాన్లే...? అమ్మాయ్, నిప్పుపిడక యిలాతే?' ఎక్కడో తప్ప పల్లెటూళ్ళలో ఛస్తే అగ్గిపుల్లను ఖర్చు కానీరు. సత్యం తన జేబులో అగ్గిపెట్టి ఇచ్చాడు! రత్తయ్య ఓ గుక్క పీల్చి, చప్పగా వుంది అని చక్కాపోయాడు. జానకి ఏవేళకూ తెమిలిరాలేదు. ఒక్కడూ పడుకుని పొగవలయాలుగా వదులుతున్నాడు. నరాలు జివ్వు జివ్వు మంటున్నై. తను ఆగలేదు. మనస్సంతా పెట్టిపూచ్చేసే దేవతను వరం అడగటంలో తప్పులేదు. మనస్సు తహతహలాడుతోంది!

'జాగర్త!' తన రెండోవాడు.

'ఏం?'

'బొందను పడకు.'

'నా ఆరాధ్య దేవత....వరం అడుగుతున్నాను.'

'నోర్ముయ్. పిచ్చిపిచ్చివేషాలు వెయ్యక. మర్యాద చెడగొట్టుకోకు.'

'ఏడిసినట్టుంది నీ సలహా.'

'చనువుగా మాట్లాడినంతమాత్రాన ప్రతి స్త్రీ ఆరాధ్యదేవతై వరాలివ్వదు!'

'జానకి వేరు....జానకి లేకపోతే నేబతకను!'.

రెండోవాడు ఐపులేడు. జానకి నూనెసీసా, దువ్వెనా తెచ్చుకుంటుంది సావిట్లో....సత్యం మనస్సు ఎగిరి గంతులేస్తోంది. అదృష్టంకొద్దీ రత్తయ్య ఎప్పటికప్పుడు తప్పుకుంటున్నాడు. జోస్యం అబద్ధం కాదు; సుతరామూ కాదు— ముందుగతి యిదీ అని దారి చూపించి వొదులుతుంది గాని. సాంబయ్య చెప్పకపోతే, తానింకా చీకట్లో ఎంతకాలం తడుముకుంటూ వుండాలిసొచ్చేదో? యిదీ బాగానే వుంది. మొదటి ఉద్ధృతాన సీతను నాలుగు ఉతకలేదు. వేదాంతిగారు ఆనాడు గుళ్ళో అన్న ఔచిత్యం ఇదే అయివుండచ్చు. ఉఁహుఁ. ఇంకా వెనక్కి తప్పుకుంటూ పోవటం దేనికి? జానకి పాపట తీసుకుంటోంది. సత్యం అదే చూస్తు

న్నాడు. సంధ్యారుణిమ రంగులు మాసిస్తోంది. జానకి ముఖం పద్మం లాగా ప్రసన్నంగా వుంది. అద్దంలో చూస్తూ చెంపలు దువ్వుకుని నెమ్మదిగా లేచింది. తనను తాను నిలవరించుకోలేక పోతున్నాడు సత్యం. ముఖం కడుక్కోటానికి జానకి పెరట్లోకి వెళ్ళింది. తనూ వెళ్ళాడు. వరాలివ్వడానికి దేవి సిద్ధం అవుతూన్నది. తను కష్టించి సాధించిన పరిమితి అయిపోయింది.

జానకి వాస్తోంది.... 'నీతో ఓ మాట చెప్పాలి'. —జానకి ఆగింది. కటిక్కిన జానకి చెయ్యి పట్టుకున్నాడు. జానకి చలించింది, ఆగింది.

'జానకీ!' సత్యం గొంతు ఆత్రాన్ని ప్రస్ఫుటిస్తోంది.

జానకి నెమ్మదిగా తన చేతిని తీసుకుంది. ఏమీ మాట్లాడలేదు. నేరుగా గదిలోకి వెళ్ళింది. తనూ వెళ్ళాడు, బాణంలాగు. గోముగా తన ముఖం జానకి వీపున రాచే ప్రయత్నంలో వున్నాడు. జానకి ఆగింది. తనూ ఆగాడు.

'తప్పు....'

'తప్పా....? వుత్తది....' నవ్వాడు. యింకా చొరవ చేస్తున్నాడు. ఆ మెత్త మెత్తగావుంటం యిష్టపడడం కాదు ఖర్మ.

'ఊఁ.' గర్జింపు లాంటిది.

అనుకుల్యానికి నాందిలాంటి పరీక్ష లాగుంది సత్యానికి.

' తప్పు అంటే వినవేం?'....

జానకి మాట సొంపు మారింది. సత్యం రిచ్చపడి చూస్తున్నాడు.

'కల్లా కపటం లేనివాడివని చనువుగా వుంటే— యిదా నీ ఆలోచన?'

'నా అంతరంగం - నీవు—'

'వొద్దు. నా మాట విను. నీవు యిక్కడి నుంచి వెళ్ళిపో....' మెత్తని గొంతుకే కాని కత్తి.— లోయలోకి పడ్డట్టైంది.

సత్యం ఏదో గొణుక్కుంటున్నాడు.

'నీవూ, సీతా సుఖపడండి. చనువుగా ఐనవాళ్ళతోటే మాట్లాడ గూడదు. తెలిసింది.'

జానకి వెళ్ళింది.

నివ్వెరపోయి అక్కడ నుంచి కదలలేకపోయాడు సత్యం.

తన మాట తనకే పేలవం అనిపిస్తోంది. కలుగులోకి పాము దూరింది. కలుగుకు మెత్త వేశారు. దారిలేదు. అక్కడి పాము అక్కడ కుళ్ళి చావవలసిందే. బరువుగా పిచ్చిగా కదలి, సావిట్లోకి వొచ్చి, నులక కుక్కిమీద వాలాడు. అంపశయ్యలాగుంది మంచం. పడమటింట్లోకి వెళ్ళాడు. జానకి పొయ్యి రాజేస్తోంది. తలెత్తి చూసింది. దగ్గిరకొస్తు న్నాడు. 'దూరంగా వుండు....' సత్యం మాట్లాడలేదు. 'వొస్తా' నని బయలుదేరాడు. యిల్లు తనను చూసి వెక్కిరిస్తున్నట్లుంది. వీధిలోకి వచ్చాడు. ఎవరెవరో వొస్తున్నారు వెళుతున్నారు. అలవాటుగా కాళ్ళు అత్తారింటికి వెళుతూనైన్నె. కావాలని దారి తప్పించి గుళ్ళకేసి నడిచాడు. గుళ్ళో ఎవరూ లేరు. పడుకుని ఉన్న కుక్క అతన్ని చూసి లేచి వెళ్ళి పోయింది. కూలబడి లేచాడు. నించోలేడు. కూచోలేడు. పచార్లు చేశాడు. ప్రదక్షిణంగా మారింది. కాలవ కట్టకేసి నడిచాడు. ఏమీ తోచలేదు. బడబానలంగా పొంగుతూన్న మనస్సు పాతాళందాకా కుంగింది. దారిన బడి నడిచి నడిచి మళ్ళీ వెనక్కి తిరిగాడు. బాగా చీకటిపడింది. అత్తా రింటికి వచ్చాడు.

గూట దీపంతోపాటు నోట మెతుకు ఈ యింట్లో. అన్నం ముందు కూచుంటే ముద్ద ఎక్కలేదు. మనిషి ముభావంగా వుంటం చూసి ఎవ్వరూ ఏమీ అనలేదు.

చెయ్యి కడుక్కుంటూంటేనే— సీత తమలపాకుల చిలకలూ, వక్కపలుకులూ యిచ్చి వైతొలగింది. సీత తల్లో పూలు మెరిసినై. వొక్కడూ పడుకున్నాడు. ప్రవాహం తిప్పితిప్పి కొడుతోంది. మన సును నిలవరించుకోటం చేతకావటంలేదు. తన రెండోవాడు గూడా ఐపు లేడు. ఆకాశం భయంకరంగా కనపడింది. సీత వొచ్చి తచ్చాడి లోప లకు వెళ్ళింది. అత్తగారు లోపల ఏదో సర్దుతోంది. లేచి గదిలోకి వెళ్ళాడు.

'అల్లాగున్నారేం?' సీత.

'అబ్బే.... ఏం లేదు.'

'ఏం జరిగిందీ- మరీ ముడుచుకుపోతున్నారు?'

'లేదే—'

'సరేలెండి. నాతో చెప్పగూడదు కాబోలు.'

— సత్యం మాట్లాడలేదు. ఏదో పుస్తకం ఉంటే తీసి చదవ బోయాడు. అక్షరాలు అక్షరాలుగానే ఉన్నయ్. గాని చదవ మనస్కరించ లేదు. మనస్సు ఓ పాతాళానికి వచ్చినట్లుంది—

'సీతా!'

తలెత్తింది.

'మీ మామయ్యగారి ఊరు పోదాం.'

'ఎందుకూ?'

'పిలిచాడుగదా....'

చప్పరించేసింది సీత.

'సీతా! నిన్ను మీ రామ్మూర్తి మామయ్యకు యిస్తానన్నారా....?'

సీత నవ్వింది.

'ఏం— ఎందుకివ్వలేదు?'

'బతికించారు.... యిచ్చేసి ఉంటే చద్దును!'

'ఛ!'

'వాడి గుణం మీకేం తెలుసు?'

'ఏం మంచివాడేనే....'

'మరో గరిటె నెయ్యి వేసుకుంటే— పెళ్ళాంమీద కొరకొర లాడుతాడు!'

'అంత బోళావాడు.... అలా అంటాడనుకోను....'

'నిజం వుత్త ముదనష్టమ్మనిషి!'

'ఏమీ తెలీనీడు. అంత వాడా....?'

'తల్లితో కలిసి, పెద్ద మామయ్యను క్షవరం చేశాడు!'

'ఊఁహుఁ. ఐనా తప్పేముంది? తన మంచి చూసుకున్నాడు!'

'ఎదటి పచ్చ గిట్టదు. మీకేం తెలుసు?'

'నీకు తెలుసు కాబోలు మహా....'

'వాడి పేరెత్తకండి....మామయ్యగదా అని పలకరిస్తే పలకటం గాని....'

ధోరణి మార్చిందే—ఎత్తా, నిజమా?

'మనలో మాట, సీతా.... అయిన సంబంధాలు ఎప్పుడూ మంచివి సుమా!'

'పోనిద్దురూ, ఎందు కిప్పుడా మాటలు?....'

'నువ్వింత చెప్పుతున్నా, రామ్మూర్తి అంటే నాకేం తప్పు తోచటం లేదు.'

'అంతగా యిష్టం అయితే— స్నేహం చెయ్యండి—- తలంటుతాడు!....'

'అబద్ధం. నిజమే అయితే మీ నాన్న 'పుండరా' అని ఎందుకంటాడు?....?'

'అదా? మా నాన్న ఎక్కడ గట్టిగా అడుగుతాడో అని నిన్న వొచ్చిన వాడు యివాళ దూసుకున్నాడు. మాకు రెండొందలు బాకీ!'

'చచ్చాం, అదా ఉండమంటున్నా ఉడాయించుకు పోటానికి కారణం!'

'నయమే. అనుకున్నదల్లా నిజం అని రంప కోత కోశానుకాదు' అనుకున్నాడు.

'సీతా! దా, యిలారా.'

సీత ఏమీ కదలలేదు. ఎలాగ కూర్చుందో అలాగే మంచం మీద ఉంది.

'అదా,' అంటూ సత్యం గునిశాడు. 'పండక్కు ఏం కొందాం అంటావ్!' సత్యం నిట్టూర్చాడు. సీత చెంపల మీద వెచ్చగా పడింది ఆ నిట్టూర్పు.

'ఏం వొద్దులెండి....పండుగ పండుగ అని వీలూ చాలూ చూసుకోవద్దూ!' అంది సీత!

'ఇదీ నీవంటే ప్రేమ కురిపించే స్థలం.' తన రెండవవాడు.

ముల్లు యివతలికి వొచ్చాక చూసినట్లు చూస్తున్నాడు సీతను. అర్థం కాక సీత చూస్తోంది!